

నిత్యాన్నదానానికి విరాళం

ఐ.పోలవరం: మురమళ్లలోని వీరేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి సీతంరాజు శివరామకృష్ణ దంపతులు (విశాఖపట్నం) గురువారం రూ.50 వేల విరాళం అందజేశారు.



తూర్పుతీర భద్రతపై సమీక్ష

కాకినాడ క్రైం: కోస్ట్‌గార్డు ప్రధాన కార్యాలయంలో హెచ్‌క్యూఎస్‌సీ సీవోఎస్ సమీర్ సక్సేనా అధ్యక్షతన గురువారం సాయంత్రం తూర్పు తీర భద్రతపై సమీక్ష నిర్వహించారు.

14న లోక్ అదాలత్



కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఈ నెల 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గంధం సునీత గురువారం తెలిపారు.

న్యూస్‌రీల్

సీఎం సహాయ నిధికి విరాళం



కలెక్టర్‌కు చెక్కు అందిస్తున్న సాత్విక్ తల్లిదండ్రులు

అమలాపురం రూరల్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాత్విక్ సాయిరాజ్ రూ.2 లక్షలు విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు సాత్విక్ తరపున ఆయన తల్లిదండ్రులు రంగమణి, రంకిరెడ్డి కాశీవిశ్వనాథ్‌లు గురువారం అమలాపురం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్‌ను కలసి ఆ చెక్కును అందజేశారు.

మాజీ ఎంపీ సురేష్ అరెస్ట్ సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అమలాపురం టౌన్: బాపట్ల మాజీ ఎంపీ, దళిత నేత నందిగం సురేష్‌ను తప్పుడు కేసుల్లో ఇరికించి అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఖండించారు. ఇది ముమ్మాటికీ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యేనని అన్నారు. స్థానిక ప్రీతి రెసిడెన్సీలో గురువారం జరిగిన వైఎస్సార్ సీపీ దళిత నాయకుల సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడారు. 2021లో మంగళగిరి టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడిలో నందిగం సురేష్ పాత్ర ఎంత మాత్రం లేకపోయినా ఏదో కేసులో ఇరికించాలన్న కుట్రతోనే ఈ అక్రమ అరెస్ట్ జరిగిందని ఇజ్రాయిల్ పేర్కొన్నారు. ఒక దళిత నాయకుడి ఎదుగుదలను ఓర్వలేకే సీఎం చంద్రబాబు ఈ అక్రమ మార్గాన్ని ఎంచుకున్నారన్నారు. ఒకపక్క విజయవాడ వర్షాలు, వరదలతో అతలాకుతలమై బాధితులకు సహాయ సహకారాలు అందించడంలో ఘోరంగా విఫలమైన ప్రభుత్వం ఆ చెడ్డ పేరును పక్కదోవ పట్టించడానికే సురేష్ అక్రమ అరెస్ట్‌కు తెరతీశారని ఆరోపించారు. నాయకులు చేట్ల రామారావు, ఆకుమర్తి సత్యనారాయణ, కొల్లు శ్రీనివాస్, నేదునూరి ప్రశాంత్, చేట్ల సత్యనారాయణ, బొమ్మి రాజేష్, చేట్ల విద్యాసాగర్ తదితరులు మాజీ ఎంపీ సురేష్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఆలయంలో చోరీ

అమలాపురం రూరల్: కామనగరువు గ్రామ కిమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలో వేంకటేశ్వర స్వామి ఆలయంలో భారీ చోరీ జరిగింది. ఉదయం ఆలయం తెరిచే సరికి చోరీ జరిగినట్లు అర్చకులు గుర్తించారు. ఈ విషయమై అమలాపురం తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రూరల్ సీఐ వీరబాబు, ఎస్సై శేఖర్ బాబు సంఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. ఆలయం తలుపులు పగులగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు లోపలకు ప్రవేశించి ఈ చోరీకి పాల్పడ్డారు. వేంకటేశ్వర స్వామివారికి చెందిన కిలో బంగారం, రెండు కిలోల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు పోలీసులు గుర్తించారు. క్లూస్ టీమ్‌ను వచ్చి వేలిముద్రలను సేకరించింది. ఈ ఆలయంలో హుండీని ఎత్తుకు వెళ్లి మరో ప్రాంతంలో పాడేయడాన్ని పోలీసులు గుర్తించారు.

రైల్వే లైన్ అలైన్‌మెంట్‌తో తాగునీటి ప్రాజెక్ట్‌కు అవరోధం

అమలాపురం టౌన్: కోటిపల్లి- నర్సాపురం రైల్వే లైన్ అలైన్‌మెంట్ ప్రభావం అమలాపురం రూరల్ మండలంలో 11 గ్రామాలకు మంచి నీటిని అందించే చిందాడగరువు చెరువు తాగునీటి ప్రాజెక్ట్‌పై పడుతుందని పట్టణానికి చెందిన ప్రస్తుతం హైదరాబాద్‌లో హైకోర్టు న్యాయవాదిగా పనిచేస్తున్న వి.రమేష్ చంద్రవర్మ నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ కాస్ట్స్ (ఎన్‌సీఎస్‌సీ)కి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎస్‌సీఎస్‌సీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్, సికింద్రాబాద్ సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ (జీఎం)లకు నోటీసులు జారీ చేసింది. న్యాయవాది రమేష్ చంద్రవర్మ తాను ఎస్‌సీఎస్‌సీకి చేసిన ఫిర్యాదు పత్రం, జిల్లా కలెక్టర్, రైల్వే జీఎంలకు పంపించిన నోటీసుల పత్రాల నకళ్లను అమలాపురంలోని విలేకర్లకు గురువారం పంపించారు. చిందాడగరువు చెరువు డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్ ప్రాధాన్యం, రోళ్లపాలెంలో అమలేశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న ఈ చెరువులో కొంత భాగాన్ని తాగునీటి ప్రాజెక్ట్ కోసం ఆర్‌డబ్ల్యూఎస్ తీసుకుందన్నారు. చెరువు మీదుగా రైల్వే లైన్ వెళితే ఆ ప్రాంతం సౌండ్ పొల్యూషన్‌తో పాటు తాగునీటి ప్రాజెక్ట్, భక్తులకు విశ్వాసమైన చెరువుకు విఘాతం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతాలను తప్పిస్తూ రైల్వే లైన్ అలైన్‌మెంట్‌ను మార్పు చేయాలన్నారు.

అవస్థల గృహాలు

- పారిశుద్ధ్యం అంతంత మాత్రం
- దోమలతో జాగారం
- రోగాల బారిన విద్యార్థులు
- అరకొరగా స్నానాల గదులు
- మరుగుదొడ్లు మహాకంపు

తాగేందుకు నీరు దొరకదు.. గదుల్లో గాలాడదు.. మరుగుదొడ్ల శుభ్రత కానరాదు.. భవనాల నిర్వహణ అనలే లేదు.. దోమల దండయాత్రతో నిద్రలేని రాత్రులకు బ్రేక్ ఉండదు.. పెచ్చులూడుతున్న గదులను బాగు చేయించాలన్న ధ్యాసే కనిపించదు.. పిచ్చిమొక్కలు పెరుగుతున్నా కనీసం తీయించాలన్న ఆలోచనే రాదు.. ఇదేదో మారుమూల అనుకుంటున్నారా..! భవిష్యత్తు నిర్దేశకులు విద్యార్థులు ఉంటున్న సంక్షేమ హాస్టళ్లలో దుస్థితి. జిల్లాలో ఈ అవస్థల గృహాలపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్ ఇది.

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్



రావులపాలెం సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో లీకవుతున్న కిచెన్ శ్లాబ్, మూలకు చేరిన ఆర్వో ప్లాంట్



కొత్తపేట సాంఘిక సంక్షేమ వసతి గృహంలో నిలిచిపోయిన మరుగుదొడ్ల నిర్మాణం

సాక్షి, అమలాపురం: ఎన్నో ఆశలు.. మరెన్నోకలలతో ఉన్న ఊరును వదిలి, తల్లిదండ్రులకూ దూరంగా ఉండి సంక్షేమ హాస్టళ్లలో తలదాచుకుంటున్న చిరుప్రాయం అవస్థల నడుమ ఉక్కిరిబిక్కిరవుతోంది.. సాంఘిక, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో బాల, బాలికలు అనేక కష్టాలు అనుభవిస్తున్నారు. ప్రభుత్వం పట్టించుకోక జిల్లాలోని ఈ హాస్టళ్లు అధ్వానంగా మారాయి. జిల్లాలో 22 బీసీ సంక్షేమ శాఖ వసతి గృహాల్లో మొత్తం 1,010 మంది విద్యార్థులు చదువుతున్నారు. బాలురు 583 మంది కాగా, బాలికలు 427 మంది వరకూ ఉన్నారు. ఇక సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలు 23 వరకూ ఉన్నాయి. ఇక్కడ మొత్తం 2,145 మంది **ఉంటున్నారు. గతం నుంచి చదువుతూ రెన్యువల్ చేయించుకున్న వారు 1,172 మంది కాగా, కొత్తగా చేరిన వారు 972 మంది ఉన్నారు. ఈ భవనాలు చాలా వరకూ శిథిలమయ్యాయి. పది మందికి ఒక టాయిలెట్, ఒక బాత్రూమ్ ఉండాలన్న నిబంధన ఎక్కడా అమలు కావడం కాదు. శుభ్రత అనే** మాటే లేదు. స్వచ్ఛమైన తాగునీటికి ఆర్వో ప్లాంట్‌లు లేవు. కిటికీలకు దోమలు రాకుండా మెస్‌లు లేవు. ఉన్నచోట చిరిగిపోయాయి. దీంతో విద్యార్థినీ విద్యార్థులు దోమలతో నిత్యం సహవాసం చేస్తున్నారు. చాలామంది జ్వరాలు, వైరల్ జ్వరాల బారిన పడుతున్నారు. ఎక్కడెక్కడ ఎలా ఉందంటే..

తీరని సమస్యలెన్నో..

- కొత్తపేట నియోజకవర్గంలో సాంఘిక సంక్షేమ హాస్టళ్లకు చెందిన పలు భవనాలు శిథిలస్థితిలో ఉన్నాయి. కొత్తపేట సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో 116 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఈ హాస్టల్ భవనం కిచెన్, డైనింగ్ హాళ్లలో వర్షపు నీరు లీకవుతోంది. తలుపులు, కిటికీలు చెదలు పట్టి ఊడిపోతున్నాయి. కిటకీ మెస్‌లు చిరిగిపోయి దోమలొస్తున్నాయి. పాత ఫ్యాన్లకు మరమ్మతులు లేవు. లైట్లు వెలగడం లేదు. మెస్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలు గత ఏడాది నవంబర్ వరకూ విడుదల కాగా, అప్పటి నుంచి 8 నెలలకు చెల్లించాల్సి ఉంది. బాలుర వసతి గృహంలో 160 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ డైనింగ్ హాలును స్టడీ హాలు, అదనపు వసతికి వినియోగిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు తగినట్టుగా మరుగుదొడ్లు లేక గత ప్రభుత్వంలో 6 బాత్ రూమ్‌లు, 6 మరుగుదొడ్ల నిర్మాణం మొదలు పెట్టగా, ఇప్పుడు పనులు ఆగిపోయాయి.
- రావులపాలెంలో సాంఘిక సంక్షేమ హాస్టళ్లు 1, 2ను ఒకే భవనంలో నిర్వహిస్తున్నారు. 160 మంది వరకూ అనుమతి ఉన్నా ప్రస్తుతం 120 మంది మాత్రమే ఉంటున్నారు. ఇందులో జ్వరాలు, ఇతర కారణాలతో పది మంది పిల్లలు వెళ్లిపోయారు. ఇక్కడ మరుగుదొడ్లు, స్నానాల గదుల కొరత తీవ్రంగా ఉంది. మొత్తంగా 10 టాయిలెట్స్, పది బాత్రూమ్‌లు ఉండగా టాయిలెట్ నిర్వహణ అంతంత మాత్రంగా ఉంది. ఐదు బాత్రూమ్‌లు శిథిలావస్థకు చేరడంతో నిరుపయోగంగా మారాయి. ఉన్న ఐదు వాటిలోనే బాలికలు స్నానాలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అదేవిధంగా పైఅంతస్తులో మూడు గదుల శ్లాబ్‌లు పాడై గదుల్లోకి వర్షం వస్తుంది. ఇందులో రెండు గదులు నిరుపయోగంగా ఉండగా, మిగిలిన ఐదు గదుల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతూ గడపాల్సి వస్తోంది. ఆర్వో ప్లాంట్ పూర్తిగా పాడైంది. హాస్టల్‌కు వెళ్లేదారి ప్రారంభంలో మలమూత్ర విసర్జన చేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. తుప్పలు మొక్కలు పెరిగి దారి చాలా ఘోరంగా ఉంది. అలాగే హాస్టల్ నుంచి బయటకు వెళ్లే మురుగు పోవడానికి డ్రైనేజీ లేక కచ్చా డ్రైన్ నిర్వహణతో ఆ ప్రాంతంలో దుర్వాసన వెదజల్లుతుంది.




రావులపాలెం సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో తలుపులు లేక నిరుపయోగంగా స్నానాల గదులు

- ఆలమూరులోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో గతంలో 180 మంది విద్యార్థులు వసతి పొందేవారు. అయితే తగిన సౌకర్యాలు లేక విద్యార్థులు బయటకు వెళ్లిపోయారు.
- పి.గన్నవరం మండలం నరేంద్రపురం గురుకుల పాఠశాలలో 461 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో పది మంది విద్యార్థులు జ్వరాలకు చికిత్స చేయించుకుని కోలుకున్నారు.
- మలికిపురం మండలం తూర్పుపాలెం సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో 30 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. హాస్టల్ భవనం శిథిలస్థితికి చేరింది. శ్లాబ్ పెచ్చులూడి పడుతోంది.
- అమలాపురం కొంకాపల్లి హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. శ్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయి. హాస్టల్ వార్డెన్ స్పందించి సొంత ఖర్చుతో తాత్కాలిక మరమ్మతులు చేయించారు. ఇక అన్ని హాస్టళ్లలో తాగునీరు, బాత్‌రూమ్స్, కిటికీ తలుపులకు సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.
- కాట్రేనికోన బీసీ సంక్షేమ వసతి గృహంలో పారిశుధ్యం లోపించింది. సుమారు 33 మంది విద్యార్థులకు రెండే మరుగుదొడ్లు ఉన్నాయి. పరిసరాలు, మరుగుదొడ్లను శుభ్రం చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇది పాడుబడిన భవంతిలా ఉంది. గదుల్లో ఫ్యాన్‌లు లేవు. కిటికీలకు తలుపులు, మెస్ లేవు. దోమలతో విద్యార్థులు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు.
- ఐ.పోలవరం బాలుర వసతి గృహంలో 43 మంది విద్యార్థులు ఉన్నారు. స్నానాలకు నీరు సరిపోవడం లేదు. భవనం శ్లాబ్‌లు ఊడిపోతుండడంతో విద్యార్థులు భయపడుతున్నారు. వసతి గృహం చెంతనే చెత్త వేస్తుండడంతో విద్యార్థులు దుర్వాసన భరించలేకపోతున్నారు.



అమలాపురం కొంకాపల్లి వసతి గృహంలో కిటికీలకు లేని దోమల నెట్‌లు



పెచ్చులూడుతున్న ఐ.పోలవరం బాలుర వసతి గృహ భవనం శ్లాబ్

సుడులు తిరుగుతూ..

- గోదావరికి వరద పోటు
- లంక గ్రామాలను చుట్టేసిన నీరు
- లోతట్టు ప్రాంతాల్లోని తోటల్లోకి ముంపు

సాక్షి, అమలాపురం: గోదావరి వరద సుడులు తిరుగుతూ ప్రవహిస్తోంది.. లంకల గ్రామాలను చుట్టేస్తోంది.. జిల్లాలోని గౌతమీ, వృద్ధ గౌతమీ, వైనతేయ, వశిష్ట నదీపాయల్లో ఉధృతి గంట గంటకూ పెరుగుతోంది. భారీ వర్షాలకు గురువారం విరామం వచ్చినా గోదావరి మాత్రం అంతకంతకూ అధికమవుతోంది. ఎగువన భద్రాచలం, ధవళేశ్వరం బ్యారేజీల వద్ద గోదావరి పెరుగుతుండడంతో లంక వాసులకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది.

జిల్లాలో భారీ వర్షాలకు తెరపడింది. బుధవారం మధ్యాహ్నం నుంచి తెరపి ఇవ్వగా, గురువారం వర్షం జాడ కనిపించలేదు. కానీ శుక్ర, శనివారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు సామాన్యులు, రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. మరోవైపు గోదావరి నదీపాయల్లో మాత్రం వరద ఉరకలేస్తోంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద రాత్రి 10 గంటలకు 11.75 అడుగులకు నీటిమట్టం చేరింది. దీంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. 10,04,528 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. ప్రస్తుతం లంక గ్రామాలను నీరు చుట్టుముట్టింది. లంకల్లోని శివారుల్లో ఉండే లోతట్టు తోటల్లోకి వరద నీరు ప్రవేశిస్తోంది. పి.గన్నవరం మండలంపై వరద ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. గత జూలై నెలలో వరద వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకూ ఈ మండలంలో జి.పెదపూడిలంక, ఊడిమూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంకలకు తాత్కాలిక వంతెనలు తెగిపోయి స్థానికులు పడవలపై రాకపోకలు సాగిస్తున్న విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఇప్పటి వరకూ విద్యార్థులు, రైతులు, మహిళలు, వృద్ధులు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. ఇక్కడ వరద పెరగడంతో స్థానికుల ఇబ్బందులు అధికమయ్యాయి. పి.గన్నవరం అక్విడెక్టును వరద నీరు తాకింది. పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోకి వచ్చే కనకాయిలంక, ఇతర లంక గ్రామాలకు పి.గన్నవరం నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. కనకాయిలంక కాజ్‌వే పూర్తిగా ముంపునకు గురికావడంతో స్థానికులు పడవలపై వెళ్తున్నారు. పశ్చిమ పరిధిలోకి వచ్చే అయోధ్యలంక, అనగారిలంక, శిర్రవారిలంక గ్రామాల ప్రజలకు పడవలే ఆధారమయ్యాయి. 15 మండలాల పరిధిలోని ఏటిగట్టు దిగువన నదీ గర్భాన్ని ఆనుకుని ఉన్న కొబ్బరి తోటలు, పంట పొలాల్లోకి వరద నీరు చేరింది. అనధికారంగా సాగు చేసే ఆక్వా చెరువులు మరోసారి ముంపులో చిక్కుకున్నాయి. గత జూలైలో వరదలకు ఇవి ముంపు బారిన పడడంతో అప్పటి నుంచి స్థానికులు ఇక్కడ సాగు చేయడం లేదు.



పి.గన్నవరం కొత్త అక్విడెక్టు వద్ద వరద ఉధృతి



పాశర్లపూడి కరకట్ట దిగువన ఇటుక బట్టీలను చుట్టుముట్టిన వరద నీరు

పెరిగిన మరింత ఉధృతి

భద్రాచలం, ధవళేశ్వరం వద్ద గోదావరి వరద పెరుగుతుండడంతో ఆ ప్రభావం జిల్లాలోని లంక గ్రామాలపై శుక్రవారం ఉదయం నుంచి పడనుంది. పలు లంక గ్రామాల్లో నీరు చేరే అవకాశముంది. భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ కాగా, ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక ఇచ్చారు. పి.గన్నవరం, మామిడికుదురు, కె.గంగవరం, అయినవిల్లి, ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లోని పలు లంక గ్రామాల్లోకి వరద నీరు వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. అప్పనపల్లి, ముక్తేశ్వరం ఎదురుబిడియం కాజ్‌వేలు ముంపులో చిక్కుకోనున్నాయి. వరదలు, వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉందని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటుందన్నారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

కలెక్టర్ మహేష్ కుమార్



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సత్కరిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్, ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

అమలాపురం రూరల్: సమాజాన్ని సన్మార్గంలో నడిపించేందుకు ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైందని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో గురువారం అమలాపురం కలెక్టరేట్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. తొలిత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్, రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తూ ఉత్తమ సేవలు అందించిన 42 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా పాఠశాలల్లోని ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించి చదువుతో పాటు సమాజానికి అవసరమైన విలువలు నేర్పి ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థులు బాల్యంలో తల్లిదండ్రులతో కంటే ఉపాధ్యాయులతో ఎక్కువ సమయం గడుపుతారని, వారిని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకోవాలన్నారు. విద్యార్థులు విద్యతోపాటు ఆటలు, వివిధ అంశాలపై దృష్టి పెట్టేలా ప్రోత్సహించాలని సూచించారు. కోనసీమ జిల్లాలో ప్రతి సంవత్సరం విద్యార్థులకు క్రీడా దినోత్సవరం నిర్వహించేలా ప్రణాళికలు చేస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా వృత్తి ఔన్నత్యాన్ని నిలబెట్టాలన్నారు. బుద్ధులు చెప్పే మాస్టర్లు దారితప్పితే సమాజం క్షమించదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, ఎంపీపీ కుడిపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, సంపదరావు, డీఈఓ కమలకుమారి, సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు, ఏపీఓ ఎంపీకే భీమారావు, ఏఎంఓ పి.రాంబాబు, జిల్లా విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.